క్లుప్తంగా

31న సామూహిక సత్యనారాయణ వ్రతం

నందలూరు(రాజంపేట) : అరవపల్లెలోని శ్రీ కృష్ణ గీతా మందిరంలో ఈనెల 31న సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణలు తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే పౌర్ణమి తిథిని పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాలలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా శ్రావణపౌర్ణమి సందర్భంగా గీతామందిర నిర్వాహకులు గెలివి రత్నంశెట్టి, సత్సంగ సభ్యులు నాయనపల్లె జయన్న, టి.సుబ్బరాయుడు సహకారంతో కార్యక్రమాన్ని చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయానికి విరాళం

పెనగలూరు : మండలంలోని అనంతంపల్లి గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న వినాయకుడి ఆలయానికి ఎన్ఆర్ఐ ఏపీ బీసీ చైతన్య సమితి అధ్యక్షుడు తురక వెంకటసుబ్బయ్య మంగళవారం రూ.లక్షను విరాళంగా ఇచ్చారు. అనంతంపల్లెకు చెందిన పలువురు స్నేహితులు ఆలయానికి ఆహ్వానించడంతో ఆలయ అభివృద్ధికి తనవంతుగా ఈ విరాళాన్ని అందజేశారు.

సచివాలయాల తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాధవరం–2, ఉప్పరపల్లె గ్రామ సచివాలయాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల సిబ్బంది హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్‌కి వెళ్లిన సిబ్బంది వివరాలు పేరు పేరునా రిజిస్టర్‌లో తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పని చేయాలన్నారు. విధి నిర్వహణలో సమయం పాటించాలన్నారు. మాధవరం–1 గ్రామ పంచాయతీలో నీటి సమస్య ఉందని నా దృష్టికి వచ్చిందని సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలిపామన్నారు. బొగ్గిడివారిపల్లె దుర్గమ్మ కాలనీలో కూడా నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వెళ్లి వివరాలను తెలుసుకొని తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలి

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 పడకలుగా ఉన్న రాయచోటి ప్రభుత్వాసుపత్రిని ప్రభుత్వం వంద పడకలకు అప్‌గ్రేడ్ చేసిందన్నారు. కాగా నిర్మాణ పనులు మాత్రం నెలల తరబడి కొనసాగుతున్నాయన్నారు. దీంతో రాయచోటి చుట్టుపక్కల ప్రజలు సరైన వైద్యమందక వైద్యం కోసం తిరుపతి, వేలూరు, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు పరుగులు తీస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న భవనాల పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలను పూర్తిచేయించి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

వాహనాల రికార్డులు తప్పనిసరి

చిన్నమండెం : వాహనదారులు ప్రతి ఒక్కరూ రికార్డులను తప్పక కలిగి ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లూరు క్రాస్ సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. అదే విధంగా వాహనాలకు సంబంధించిన రికార్డులతోపాటు డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

సన్మానం



గోపాలకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి

పెనగలూరు : మండలంలోని చక్రంపేట ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణను మంగళవారం కడపలో వైఎస్సార్ జిల్లా డీఈఓ రాఘవరెడ్డి, ఐపీ భానుమూర్తి రాజులు ఘనంగా సన్మానించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గతంలో పీడీగా హైస్కూల్‌లో చేసిన సేవలను గుర్తించి గోపాలకృష్ణను సన్మానించినట్లు వారు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోషన్ రాకముందు పీడీగా పని చేస్తూ క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు కొనియాడారు.

నేటి నుంచి గడప గడపకు కార్యక్రమం

రామాపురం : నేటి నుంచి రెండు రోజులపాటు మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, నల్లగుట్టపల్లె సర్పంచ్ నాగభూషన్‌రెడ్డిలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండలాధికారులు, సచివాలయం సిబ్బంది హాజరుకావాలన్నారు.

సంక్షేమంతో ప్రజల జీవితాల్లో వెలుగులు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ఇంటి స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని కోరుతున్న మహిళలు



వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్‌తో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు : ఏం తల్లి జగనన్న అందిస్తున్న నవరత్నాలు, సంక్షేమ ఫలాలు అందాయా అంటూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండలంలోని పూలుకుంట గ్రామంలోని ప్రజలతో మమేకమయ్యారు. మంగళవారం ఆయన పూలుకుంట గ్రామ సచివాలయం పరిధిలోని వడ్డెపల్లె, బండిమీదపల్లె, గుంటికాడపల్లె, రెడ్డివారిపల్లె, మంగళపల్లె, ఈడిగపల్లె, ఎస్సీ కాలనీలలో గడప గడపకు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ నవరత్నాల పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి పలు సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుంటే మరింత సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రం కొనసాగుతాయని వివరించారు. అలానే వైఎస్సార్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ప్రతి చెరువు, ప్రతి కుంటలకు పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి రైతులు సాగు చేసిన పంటలను సాగునీరు, తాగునీటిని సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం పూలుకుంట గ్రామం సచివాలయం ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాగా మండలంలో గడప గడపకు కార్యక్రమం పూర్తవ్వడంతో ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను సమస్యల ప్రాధాన్యతా ప్రకారం కేటాయించి పనులు చేపట్టనున్నారు.

స్కీం బోర్లు ప్రారంభం

పూలుకుంట గ్రామం నూతన గ్రామ సచివాలయం భవనాన్ని, మంగళపల్లె, ఈడిగపల్లెలో జేజేఎం నిధులతో మంచినీటి పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. హరిజనవాడ వాసులకు చాలా రోజుల నుంచి ఇంటి స్థలాలు పెండింగ్ ఉందని ఆయన దృష్టికి తీసుకురావడంతో జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించి సమీపంలోని రైతుల వద్ద నుంచి భూమిని కొనుగోలు చేసి హరిజనవాడ ప్రజలకు స్థలాలను ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి, ఆవుల నాగభూషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విశ్వనాధరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.రమేష్‌రెడ్డి, గుమ్మా అమర్‌నాథరెడ్డి, మాజీ సర్పంచ్ పి.హరినాధరెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమాపతిరెడ్డి, ఉమా ప్రభాకర్, నారాయణ, రామాంజులురెడ్డి, ఎంపీటీసీలు గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, తమటం చిన్నరెడ్డి, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పంట బీమా అందేలా చూడాలి

రాయచోటి : తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన రాయచోటి నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకు పంటల బీమా అందేలా చూడాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏడీలు, మండల వ్యవసాయశాఖ అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై మంగళవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్, క్రిందిస్థాయి అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 15వేల హెక్టార్లలో వర్షాధార పంటలను సాగు చేశారన్నారు. వర్షాలు లేకపోవడంతో వేరుశనగ పంట ఎండు దశకు చేరుకోవడం బాధాకరంగా ఉందన్నారు. కావున నియోజకవర్గంలో రైతులు సాగుచేసిన ప్రతి పంటనూ వ్యవసాయ అధికారులు తప్పక క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఇలాంటి పరిస్థితులలో పది మందికి అన్నం పెట్టే రైతులను కాపాడుకునే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంట వివరాలను నమోదు చేసి నివేదికను తయారు చేయాలన్నారు. నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బీమాను అందించి ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు.

వెలిగల్లు నీటితో చెరువులను నింపుతాం

వెలిగల్లు ప్రాజెక్టు పరిధిలో ఉన్న చెరువులను నీటితో నింపుతామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పూడికతీత పనులను రెండు, మూడు నెలల్లో పూర్తిచేసి ఆయకట్టు చెరువులన్నింటినీ నీటితో నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందించే చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు నీటితో నింపడం వలన సమీప ప్రాంతాలలో భూగర్భజలాలు పెరగడంతోపాటు తాగునీటిని అవసరమైన నీరు లభ్యమవుతుందన్నారు.

ఆ ప్రయత్నంగా అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులతో పేర్కొన్నారు.

అధిక ధరలు, నిరుద్యోగ నిర్మూలనపై సీపీఎం సమరభేరి

రాయచోటి అర్బన్ : అధిక ధరలు, నిరుద్యోగ నిర్మూలన తదితర అంశాలపై ఈ నెల 30 నుంచి సీపీఎం సమరభేరిని మోగించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అబ్బవరం రామాంజులు అన్నారు. మంగళవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలసి సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ వాటిని రాష్ట్రాలపైనా రుద్దడం సరైనది కాదన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపుతో సామాన్యులు, పేదలపై మోయలేని భారం పడిందన్నారు. వ్యవసాయ మోటార్లు, ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపునకు చేస్తున్న యత్నాలను వెంటనే విరమించుకోవాలంటూ డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ప్రజలపై భారాలను నిరసిస్తూ ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరసనలో ప్రజలు, విద్యార్థులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మాధవయ్య, శేఖర్, రెడ్డెయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమరభేరి వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నేతలు, శ్రేణులు

ఓటర్ల తొలగింపులో విమర్శలకు తావివ్వకండి



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారి నాగరాజు

రైల్వేకోడూరు అర్బన్ : ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులను సిబ్బంది స్వయంగా పరిశీలించి, తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్‌లు తెలిపారు. మంగళవారం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. ఓటరు జాబితాలో సవరణలకు సరైన కారణాలు ఉంటేనే చేయాలన్నారు. ఎక్కడేగాని విమర్శలకు తావివ్వకుండా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఓటర్ల తొలగింపుపై పునఃపరిశీలించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో మరోమారు కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు అమరేశ్వరి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రెడ్డిప్రసాద్, ఆర్ఐ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్, కారు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రామాపురం : మండలంలోని వేంపల్లె – రాయచోటి ప్రధాన రహదారిలోని కుమ్మరపల్లె వద్ద మంగళవారం స్కూటర్, కారు ఢీ కొన్నాయి. వివరాలు వేంపల్లికి చెందిన అంజి ద్విచక్రవహనంలో రాయచోటి నుంచి వేంపల్లెకు వెళ్తుండగా లక్కిరెడ్డిపల్లె నుంచి రాయచోటికి వెళ్తున్న కారు మార్గమధ్యలోని కుమ్మరపల్లె వద్ద ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు అంజి కాలుకు తీవ్ర గాయాలు కావడంతో, చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

అభివృద్ధిని తెలియజేద్దాం.. దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

- దొంగ ఓట్లంటూ టీడీపీ చేస్తున్న విషప్రచారం ఓ ఎత్తుగడే
- జేసీఎస్‌లకు బీమా నమోదు సభలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తదితరులు

రాజంపేట : ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, అధికారం రాదనే ఉద్దేశంతో ముందుగానే తెలుగుదేశం పార్టీ దొంగ ఓట్ల ఎత్తుగడులకు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మేడా భవన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులకు బీమా నమోదు కార్యకమం సందర్భంగా నిర్వహించిన సభకు ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి, సంక్షేమంలో కొత్తపుంతలు తొక్కుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ఎల్లోమీడియా చేస్తున్న విషప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావడానికి ఇప్పటి నుంచి కార్యకర్తలు, నాయకులు సమైక్యంగా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి రెండవసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించేలా ప్రజల్లో ప్రభుత్వం చేసిన పనితీరును తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు మేడా విజయభాస్కర్‌రెడ్డి, రాజమ్మ, నాయకులు ఆకేపాటి మురళీరెడ్డి, గండికోట గుల్జార్‌బాషా, ఈశ్వరయ్య, రామ్మోహన్‌నాయుడు, జేసీఎస్ సుబ్బారెడ్డి, దాసరి పెంచలయ్య, లక్ష్మీనరసయ్య, వేణుగోపాల్‌రెడ్డి, వడ్డె రమణ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, జానకిరాం, నడివీధి సుధాకర్, కుల్లాయిరెడ్డి, నీలకంఠంరెడ్డి తోపాటు నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి

- తెలుగు భాష విశిష్టత, గిడుగు సేవలను వివరించిన వక్తలు
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలు



చిన్నమండెం: ఉప్పు, రంగులతో ధ్యాన్‌చంద్ చిత్రాన్ని చక్కగా తీర్చిదిద్దిన దృశ్యం



ఓబులవారిపల్లె: గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : గిడుగు వెంకట రామ్మూర్తి గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొని వచ్చిన మహనీయుడని వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి తెలుగు వచనానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : తెలుగును మరింత సులభతరం చేసేందుకు కృషి చేసిన గిడుగు రామ్మూర్తి, హాకీలో దేశప్రతిష్టను ప్రపంచ స్థాయికి చేర్చిన ధ్యాన్‌చంద్ నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మండలంలోని మాధవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వి.వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాష దినోత్సవాలను ఘనంగా జరిపారు. గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు.

రాయచోటి టౌన్ : పట్టణంలోని డైట్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం డైట్ కేంద్రంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా దేవి ఆధ్వర్యంలో గిడుగు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక డైట్ కేంద్రంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ క్రీడా రంగానికి ఎనలేని సేవ చేశారని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కె. శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం డైట్ కేంద్రంలో గిడుగు జయంతి వేడుకలతోపాటు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఓబులవారిపల్లె : మండలంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంజీవపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని శ్రీ భారతీ హైస్కూల్‌లో మంగళవారం గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముక్కర నిర్మలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాషోద్యమంలో గిడుగు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

రామాపురం : విద్యార్థులు మాతృభాష పట్ల నిర్లక్ష్యం వహించరాదని ప్రిన్సిపాల్ శ్యామలాదేవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు.

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో భాషా, క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించి గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి, మూడు సార్లు ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు దుర్గరాజు, రాజశేఖర్, యుగంధర్, నాగార్జున, స్వతంత్రబాబు, విజయలక్ష్మి, సుహాసిని, చినబాబు, వెంకటసుబ్బయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ రెడ్డమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పెనగలూరు హైస్కూల్‌లో ఘనంగా నివాళి అర్పించారు. అలానే కొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలు నాగకుమారిని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.

రైల్వేకోడూరు : తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు ఘనంగా నిర్వహించారు. అనంతరం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు. తెలుగు భాష వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రిన్సిపాల్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

చిన్నమండెం : మండలంలోని పలు పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి జయంతి తెలుగు భాషా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ రమేష్ ఆధ్వర్యంలో ఉప్పు, రంగులతో ధ్యాన్‌చంద్ చిత్రాన్ని తీర్చిదిద్దారు.



సంబేపల్లె: నివాళి అర్పిస్తున్న దృశ్యం



చిట్వేలి: సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు



రాయచోటి టౌన్: నివాళులర్పిస్తున్న టీచర్లు

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి



కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న మహిళలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో అర్హులైన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ రాయచోటి ఏరియా కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని అర్హులైన పేదలతో కలసి ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాయచోటి అర్బన్ పరిధిలోని సుమారు 800 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. నెలలు గడుస్తున్నా వారికి ఇళ్ల స్థలాలు చూపించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

భూ ఆక్రమణలను అడ్డుకుంటాం

గాలివీడు : మండలంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే అడ్డుకుంటామని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆక్రమిత ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలివీడు గ్రామ పరిధిలోని బుట్టిగారిపల్లె వద్ద నల్లగుట్టలో సర్వే నెంబరు 1465లో కొందరు జేసీబీ యంత్రాలతో చదును చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇదే విషయమై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా పనులను అడ్డుకున్నారన్నారు. భవిష్యత్తులో నల్లగుట్ట ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు తెగబడకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేలా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. నల్లగుట్ట పొడవునా చాలా వరకు ప్రభుత్వ భూమి ఉందని, అది ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కెజిబివిలలో చదువుకుంటునన విద్యార్థులు పలురకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో తాగునీటి వసతిని కల్పించాలని, మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. నాడు – నేడు పథకంలో భాగంగా వెంటనే వసతి గృహాలను అభివృద్ధి పరచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కాకుంటే విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ నేతలు గణేష్‌రెడ్డి, శేషాద్రి, తిరుమల కుమార్, గోపాల్‌రెడ్డి, లోకేష్, నరసింహ, భాను, సాయికుమార్, గోపాల్, చిన్నారెడ్డి, బాలచందర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.